శ్రీరస్తు                                        శుభమస్తు



# సాయి సచ్చరిత్ర

**(సోమవారంపారాయణ)**

**ద్విపద పాఠ్యము :**

**రచన :**


**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech




**ఐదవ అధ్యాయము**

**శ్లో॥ నమోస్తుతే సాయినాథ! నమోరక్షప్రదాయకం**
**నమో భక్తపాలంచ షిర్డివాసా నమోస్తుతే**

## ఊదీ ఉదంతం

బాబాకు ఇష్టమౌ వానిలో కలదు
ఆ బూది ఊదీగ ఆయె ప్రసిద్ధి

ఊదీ మహిమ ఎంతో ఉన్నతంబయ్య
అది విన భక్తులకందును మేలు

దానిగురించియే ధన్యతన్ చెబుదు
దాని వాడిన బాధ తగ్గునోరయ్య

**రావయ్య కళ్యాణ రామ! ఊదీని**
**నీవుతే శుభముగ నింపి గోతమున**



సాయినాధుని పాట సంగీతమవగ
హాయిగా వినుచుందు రఖిల భక్తులును

నిత్యాగ్నిహోత్రమై నెగడెనుధునిని
అత్యంత నిష్టతో ఆయన నెరిపె

ఆ ధునిలోనిదే అయిన ఆ ఊది
బాధతగ్గించును బాబాయే చెప్పె

నేటికి వేలాది నీటితో ఊది
మేటి మందుగ త్రాగి మేలుగాంచేరు

## అగరొత్తుల బూదియే ఊది

'నారాయణాజాని' నమ్మును సాయి
తిరుగాడు దైవమై తీర్చు బాధలన్ని



ఆతని మిత్రుడు అవిసె బాధిల్లి
అతనిని కుట్టంగ అడవిలో తేలు

మందులా ఆ ఊది మహిమ జూపింది
అందరి నమ్మకం అయిననూ అచట

ఎవరి చెంతను ఊది ఇంతైన లేదు
కావనా భక్తుని కష్టంబునుండి

బాబా పటము వద్ద పడియున్నదైన
ఆ బూది తెచ్చారు అగరువత్తులది

వేడి సాయిని'జాని' పెట్టెను నుదుట
వాడు మిత్రుని గూడి ప్రార్థించినాడు

ఊదిలా పనిచేసి ఊరటిచ్చింది
ఆ దివ్య మహిమకు అచ్చెరవొంది

పూజించినారట ఊదిలా బూది
నిజముగా పనిచేయు నిలుపు నమ్మకము

## భక్తియుంటే మట్టే బూది

భక్తు డొక్కండుండె బాంద్రా నివాసి
శక్తి యుక్తుల గొల్చు సాయినాతండు

ఆతని పుత్రిక అడరె ప్లేగొచ్చి
అతిహీనస్థితినుండె ఆమె గ్రామమున

ఆమెను చూడగ ఆమె తండ్రియును
ఆమె తల్లియుకూడ ఆత్రుతపడిరి

5.5

ఊది లేకుండెను ఒట్టి చేతులతొ
కదలిరి పుత్రిక కడకు భీతిల్లి

కనిపించె 'నానాజి' కళ్యాణు వద్ద
వాని చెంతను కూడ బడయరే ఊది

**నానాజి యోచించి నయముగా పలికె**
**వాని దయనుకోర బాబాయె గాచు**

దారిలో మట్టిని తన చేత తీసి
స్మరియించి బాబాను సఖు చేతికిచ్చె

తనయ నుదుటిపైన నతడుతానుదిద్దాడు
వెనువెంటనే వ్యాధి బిర బిరా చనియె

5.6

కనుగొనిరా వింత కంటినీరొలక
కనకున్ననూ గాని కరుణించు సాయి

ఊదీకి శక్తియే ఉందని తెలిసి
పదమంటి మొక్కారు బాబా పటముకు

## ఊదితో ప్లేగు ఉపశమనం

'బాపాజి' శ్యామాకు భ్రాత వానిసతి
కాపాడమని వేడె కన్నీటితోటి

ప్లేగు వ్యాధితొ ఆమె పీడించ బడెను
అగుపించె పొక్కులు ఆమె భీతిల్లె

5.7

సాయిని వేడెను శ్యామా శరణని
ఆయన దయ జూపి అందించె ఊది

**రేపటి ఉదయాన లేచి నీవెళ్ళి**
**ఇపుడు నేనిచ్చెడి ఈ ఊదినిమ్ము**

**నుదుటిపై వ్రాయుము, నోటితో కొంత**
**ఉదకంబుతో జేర్చి ఊది త్రాగమను**

ఆ రీతిగా జేసె ఆమె యంతటను
ఆరోగ్యమును పొందె ఆ మరునాడె

తేనీరు అందించ తిలకించి శ్యామ
వీనుల విందుగ వేడె బాబాను

5.8

## రాచకురుపైనా రాంరాం

'మాలెగాం' వైద్యుడు మంచివాడతను
పిలిపించు కొనినాడు వైద్యమ్ము సేయ

అతని మేనల్లుడు అలమటించాడు
ఆతని బాధించెనా రాచకురుపు

ఎన్నిమందులు వాడ ఏగుణమీదు
అన్ని వైద్యంబులు అయ్యె హుళక్కి

ఎవ్వరో చెప్పగా హితవు వైద్యుండు
అవ్వాని తెచ్చెను ఆ సాయి కడకు

కురుపుపై చేతిని కూర్చి త్రిప్పుచును
గురు దేవుడిటు చెప్పె కుర్రవానికిని

5.9

ఈ మసీదునయున్న హితుడీ ఫకీరు
తా మాటగా చెప్ప తథ్యంబు జరుగు

ఊది వ్రాసితి నేను ఒనగూడు నయము
ఏదియున్ బెంగొద్దు హితవుగాంచేవు

వారంబులోపున వ్యాధి నెమ్మదయె
తరువాత క్రమముగా తగ్గె పూర్తిగను

## మూర్ఛ తగ్గించిన ఊదీ

నమ్మకముంచిన నయమగునయ్య
నమ్మకం లేకున్న నయము కాదయ్య

ఊది ప్రసాదమౌ యొనరించు నయము
బూదియే మిగులును బుద్ధి హీనులకు

5.10

ఒనగూర్చె మేలును ఒక ఇరానీకి
వాని కూతురి మూర్ఛ వ్యాధి తగ్గించి

ఊదీని కలిపిరి ఉదకంబులోన
ఉదకంబు త్రాగిన ఊరటిచ్చింది

ఆ సాయి దయవల్ల అగు బూది మందు
ఏ సాటి లేకుండ ఇదియే నిజంబు

## మూత్రపిండంలో రాయి మాయం

'హార్దా' లొ వసియించు అతి వృద్ధుడొకడు
షిర్డీ నివాసుని శిష్యుడై గొలిచె

మూత్రపిండపురాయి మూల్గించెనతని
ఆత్రుత వ్యధ నొందె ఆ వృద్ధుడెంతొ

5.11

తను శస్త్ర వైద్యంబు దరికినిబోడు
తన బాధకోర్వడు దయనీయమయ్యె

ఆతని మిత్రుడు ఆ వ్యధ జూచి
ఆతని సుతుకిచ్చె ఆసాయి ఊది

కలిపెను నీటిలో గట గటా త్రాగె
సలిపెడి ఆ రాయి జతవీడి పడెను

ఆతని మూత్రాన ఆ రాయి యంత
స్తుతియించె సాయిని చూచి వృద్ధుండు

కట్టు కథని దీని కాదన వలదు
ఇట్టి వింతలు పెక్కులెన్నైన కలవు

5.12

## నిద్ర పట్టని వ్యాధి

సతమతంబయెనొక్క సాయి భక్తుండు
ఆతని కంటికి అమరక నిద్ర

ఆయన తండ్రియే అగుపించి కలలో
ఆయనన్ దిట్టును ఆపడు'జచ్చి'

ధరియించె నుదుటిపై, తన'దిండు' క్రింద
మరికొంత పొట్లంగ మార్చిబెట్టాడు

ఆనాటినుండియే అగుపించె గుణము
తనయుడు శాంతితో తాను నిద్రించె

5.13

## నారి పుండును నయం జేయుట

'బహు' అనే వైద్యుడు వర్ధిల్లె వినుడు
బహుధన్యుడాతండు బాబాకడ ప్రియుడు

నారి పుండుతొ బాధనణిగెను అతడు
కోరెను బాబాను కుదిరించమనుచు

వేడెను సాయిని వేదన దీర్ప
కూడి మిత్రులు వానిగొనిపోవ షిర్డి

రాబోవు పదిజన్మలకును మొత్తమ్ము
ఈ బాధపంచుమా ఈశ్వరా అనుచు

**నీ బాధ తగ్గింతు నినుగాతు అనిరి**
**మునుముందు ఈ కట్లు మెత్తంబు విప్పు**

5.14

**కాకి ఒక్కటి వచ్చి కసిదీర పొడిచి**
**నీకు ఈ వ్రణబాధ నేటితోదీర్చు**

అంతలో 'అబ్దులు' అను వాడువచ్చి
**'లాంతరు'** తుడిచేటి లక్షణంబంటు

వ్రణమునుతొక్కంగ బాధతో అరచె
వణికి పోవుచునేడ్చె 'బహు' తాను అంత

ఆతని వ్రణములోనందున్న క్రిములు
ఆతరి వెలువడె అవి 'ఏడు' కలవు

ఓదార్చి ఇచ్చిరి ఉపశమనమును
మృదువుగా నవ్వారు మన సాయి అపుడు

5.15

కుదుట బడిన 'వాడు' గురువునడిగెను
**ఏది కాకిచటకు ఏల రాలేదు**

**ఆ కాకి ఘనుడైన 'అబ్దులే'** అనగ
పకపకా నవ్విరి భక్తులందరును

పదిరోజులవుదాక వ్రణమంత పూసి
ఊదీని నీటితో నూగ్రోలమనిరి

వ్రణము తగ్గుట చూచి 'బహు'కూడ తాను
కొనియాడి సాయిని గురువుగా కొలిచె

## మైనతాయిని కాపాడిన సాయి

'చాందోర్కర'ను వాడు సాయికాప్తుండు
అందుకే చెబుదును అతని కథను

5.16

ఆతని పుత్రికన్ అలనాడు సాయి
ఏ తీరు రక్షించె ఈ గాథ వినుడు

'మైనతాయా'మెయే ఆమె కాన్పువక
ఎనలేని బాధతో ఏడ్చుచునుండె

'బువ' అనే సన్యాసి పోదల్చినాడు
ఆ వూరు 'జలగాము' ఆతని సాయి

పిలిచి సాయీ తాను వినజెప్పినారు
**'జలగాం' ముందుగా 'జామ్నేరు' పొమ్ము**

**హారతి పాటను మరియు ఊదీని**
**త్వరితంబుగా మైనతాయికి ఇమ్ము**

5.17

**తనవద్ద పైకమ్ము తగినంతలేదు**
అని బువా చెప్పెను ఆ **చింతవీడి**

**కదులుము** అనిచెప్పగా 'బువా' వెడలె
ఏది అయినగాని ఎరుగునాసాయి

అనియంచు 'జలగాము' ఆతడు చేరి
తనకేది దారని తలచె భక్తుండు

ఇంతలో 'టాంగా'ని ఎదుటగాంచాడు
అంత బంట్రోతిట్లు అడిగాడు దిగుచు

**నే'బువా' కొనిపోవ నియమించ బడితి**
**నాబండిలో రండు నయముగా మీరు**

5.18

అందులో కూర్చుని ఆ 'బువా' చేరె
సందెవేళకు తాను 'జామ్నేరు' హద్దు

ఆ 'బువా' లఘుశంక ఆర్తికై పోయె
ఏ బండి, బంట్రోతు నెరుగడే చూడ

వారివీరల తాను 'వాకబు' చేసి
చేరాడు తుది యందు చేరుగమ్యంబు

'చాందోర్కరా'తని చక్కగా పొగడి
డెందంబు పులకించ 'దైవమా' అనెను

ఊదీని 'బొట్టుగా' ఉవిదకుబెట్టి
ఉదకంబులో మిగులున్నదిచ్చారు

5.19

హారతిపాటలు అచటి స్త్రీలంత
చేరి ఒక్కటె గొంతు చేర్చిపాడారు

ప్రసవించె సుఖముగా పడతియునంత
హాస వదనముతో ఆమె తల్లయ్యె

వింతేమిటన 'బువా' వెడలుచున్నపుడు
**సంతసంబయె 'టాంగ' సమకూర్చినారు**

అన చాందోర్కరు అచ్చెరువంది
తనుపంపలేదనె తనవారినెవరి

మరి తన్ను దెచ్చిన మనిషి ఎవ్వండు
కరుణాత్ముడాసాయి కాక పోయినచొ

5.20

అచ్చెరువున శిష్యులందరు సాయె
వచ్చెనంచని తెల్సి ప్రస్తుతించారు

కీర్తించి సాయిని గీతాలతోటి
ఆర్తితో పూజించి ఆనందపడిరి

## మేఘుడు అనే మేటి భక్తుని కథ

'మేఘశ్యాముం'డనే మేటి భక్తుడిని
'మేఘుడా' అను సాయి మిక్కిలి ప్రేమ

'బాపడు' అగుటచే బాబాను చూచి
కాపాడుకొనుటెట్లు ఘనమైన 'మడి'ని

ఈ రీతి యోచించ, ఎరిగి మానసము
నిరసించి పల్కిరి నేరుగా సాయి

5.21

**బ్రాహ్మణులకు ఈడ పనిలేదు పొమ్ము**
**బ్రహ్మాగా నిలువుము బయటకుపోయి**

'కేల్కరు' అనువాడు కీర్తించి వేద
అల్కమానెను సాయి ఆదరించారు

ఆతడే మేఘుడై ఆ స్వామి కొలిచె
జతలేని కీర్తితో సాయిని పొందె

హైందవపూజల నెన్నియోతానె
పొందుగా సాయికి పొసగించినాడు

శివ భక్తుడాతడు చేరికొల్చేను
శివునిగా భావించి షిర్డీ నివాసు

5.22

మారేడు దళముల మాన్యుండు భక్తి
కోరి పూజించును గురుసాయినతడు

'గోమతీ' నీటితో గురునభిషిక్తు
తమితోటి చేయగా తలచెనాతండు

పదిఆరు మైళ్ళను పయనించితెచ్చి
ఉదకమునభిషేక మొనరించగోరె

**నే ఫకీరును, గాని, నీ శివుండవను**
**ఏ ఫలితము కల్గు ఇటు జేయ నీకు**

మొండి భక్తుడు పట్టు మూర్ఖమే గాని
అండ నాకాసాయి అని యంచు తలచె

5.23

తలకభిషేకమ్ము దయజేయ సాయి
జలమును గొనెనంత సాయిపై పోసె

తల మాత్రమే అహో తడిసింది చూడ
నిలువెత్తు పోసినానీరంబు నతడు

ఈ వింత మేఘుడు ఎరిగి ప్రార్థించె
**ఓ విశ్వనాథుడా ఓ సాయినాథ**

**పొరబాట్లు మన్నించి పుత్రుని కాచి**
**కరుణించుమోసాయి కాపాడుమయ్య**

ఒక నాడు మేఘుడు ఉండగ నిద్ర
ఒక స్వప్న మందున యోగీశుగాంచె

5.24

**లెమ్ము ఓ మేఘుడా లేచిరావయ్య**
**ఇమ్ము త్రిశూలము ఈశుండువచ్చు**

**చిత్తరువును గీసి శివునికీయాలి**
అత్తరి బోధించె ఆ సాయి కలలొ

మరునాడు మేఘుడు మనసాయినడిగె
**ఎరిగింపుమో దేవ ఈ కల ఏమి**

**కల కాదు మేఘుడా కనిపించినాను**
**కలిసినాడను నిన్ను కల్ల కాదయ్య**

**గోడలు తలుపులు గొళ్ళాలు అన్ని**
**కూడునా నన్నాప కుదరదు వినుము**

**చూడ శివుడువచ్చు శూలంబునీక**
**కూడునామర్యాద కొంతైనగాని**

5.25

సాయి చెప్పిన రీతి చక్కగా గీసి
ఆ యెడ మేఘుడు అద్దాని చూపె

మరునాడు 'రాందాసు' మనసాయి జూడ
అరుదెంచె 'పూనా' యె అతనుండు స్థలము

శివలింగమొక్కటి షిర్డికి తెచ్చె
కావుమా అని యిచ్చె కరుణాత్మునకును

చూచినావా అంచు చూపిరి సాయి
ఆ చిరునవ్వులు అచట పూయంగ

పూజించె మేఘుడు పొంది సాయిదయ
పూజించె శివునితా పూనుచు శ్రద్ధ

పదితొంది వందల పంద్రెండులోన
వదిలె మేఘుడు తన ప్రాణాలు, వాని

5.26

తలచుచు శ్రీ సాయి, **ధన్యుండు ఇతడు**
**ఇల నాకు మేఘుడు ఇష్టుండు అనిరి**

## మాటంటే మాటే

'కాకాజిసాహెబు' గారు ఘనముగా తాను
చేకొని కొడుకుకు చేయంగ 'వడుగు'

దలచెను సాయిని దయచేయమంచు
పిలుపును పంపించె వినయంబుగాను

కుదిరె 'చాందోర్కరు' కుమరుని పెండ్లి
అదె వేళ 'గ్వాలియర్' నందున యతడు

బ్రతిమాలి పిలిచెను బాబాను తాను
యతిరాజు దానికి ఔనంచు పలికె

5.27

శ్యామాను పంపించి సాయి తీర్చారు
తమ వైపు దూతగా తన వారి కోరకు

రెండు పెళ్ళిళ్ళను లెస్సగా చూడ
నిండు మనసుతోటి నిలచి దీవించె

తిరిగి మరలు వేళ తెలిపినయట్లె
జరుప 'గయ'కు యాత్ర సమకూడినాడు

బయలుదేరెడి వేళ బాబాను అడుగ
**నాయనా అట నీవు ననుగాంతువనిరి**

జరిగింది గురుతొచ్చి సాయి అచ్చుటకు
అరుదెంచునేరీతి అనితల్చెనతడు

'గయ'లోన 'పండా'యెకండుతాగలిసె
ఆయన సిరియున్నయట్టి బ్రాహ్మణుడు

5.28

ఆతని ఇంటిలో అగుపించె నపుడు
ఆతడు పూజించు ఆ సాయి పటము

కన్నులు చెమరించి ఘనశ్యాము డడిగె
**అన్న! చెప్పుడు నీకు అదిఎట్లు వచ్చె**

**పది ఏళ్ళ క్రిందట వస్తిని షిరిడి**
**అది సాయి యాజ్ఞతో అందించె 'శ్యామ'**

అని వాడు పూజించు ఆ సాయి నిచ్చె
అని చెప్పుచుండగ అచ్చెరువంది

శ్యామాయు తనపేరు సఖునితో చెప్ప
ఏ మాట రాకుండ ఇతడుండిపోయె

కాలము స్థలములు కావు అడ్డంబు
కాలుచువారిని కాచు గురు సాయి ఎపుడు

5.29

# జన్మజన్మల బంధాలు

పూర్వజన్మపు కర్మవుందను సాయి
నేర్వనా జ్ఞానము నీకసాధ్యంబు

అని చెప్పు ఈ గాధ నాలకించినచొ
మనసున రావయ్య మదమచ్చరాలు

ఒకనాడు శ్రీ సాయి ఊరి సంతందు
మేకలు కొన్నారు మేలుగా రెండు

తను నాల్గురెట్లుగా ధనమీయనేల?
అని ప్రశ్నవేసిన అన్నారు సాయి

**ఈ మేకపోతులు ఇద్దరు హితులు**
**తమ గత జన్మలో తమ్ముండు అన్న**

5.30

గత జన్మలేమిటి కలవా ఇదంత
మతిలేని మాటలా మన్నించనగును

సాయి వారికి చెప్పె **జన్మబంధాలు**
**పోయినా ప్రాణము పోవయ్య నిజము**

ఏటిగట్టున సాయి హితులతో కూడి
నోటకప్పను మ్రింగ నోటితో బట్టి

పామునచ్చటగాంచి పాపమ్ముతలచి
ఏమోయి చాలించు, మిది వీరభద్ర

పగ మరవవుకదా పన్నగంబయిన
తగదు చాలించుము తప్పు చేయకుము

అది విని మిత్రుడు అనె సాయితోడ
ఇది అంత వివరంబు నెరిగించవయ్య

5.31

బాబా ఇటుల జెప్పె భక్తునితోడ
**చేబూని సరిదిద్ద శివుని ఆలయము**

**మావూరి ప్రజలంత** మన్ననొకని
నీవె బాధ్యుడవని నియమించినారు

**ఆతని భార్యకు అగుపించి శివుడు**
**ఈ తీరుగను జెప్పె ఇంతి స్వప్నమున**

నీవు పెట్టెడి'రూక' నీకౌను 'నూరు'
**తాను నగలుతీసి తరుణి ఇచ్చింది**

**వాటిని కాజేసి వాటికి బదులు**
**బీట వారిన పొలం పెట్టాడు గుడికి**

**ఆ పొలం 'డుబ్కీ'ది ఆమె 'గిర్వీగ'**
**ఆ పాపి వద్దనే ఆమె ఉంచింది**

5.32

పూజారి బాధ్యతనుంచాడు దాని
ఆ జన్మ ముగిసెను అట ‘తుఫానొచ్చి’

వీరభద్రుండంచు పేరున బుట్టె
నారియు పూజారి నందనయ్యింది

గౌరియన్ పేరుతో కాంత ఆ ఇంట
పెరిగి పెండ్లాడింది వీరభద్రుడిని

జన్మించి ‘డుబ్కీ’, బసప్పగా పెరిగె
జన్మ విరోధము జతకూడెవాని

పూజారి మరణించ పుత్రిక కొచ్చె
నిజబాధ్యతయు గుడి నిధులన్నిగూడ

ధరహెచ్చి పొలముకు ధనమొచ్చువేళ
గౌరికలలో వచ్చి కరుణించె శివుడు

5.33

గుడి బాధ్యతను అందుకొనె ఆ బసప్ప
కూడితిన్ నేగూడ కోరి ఆతనినె

దూరి మమ్ముల కసితో చంపెదనని
వీరభద్రుండును బెదిరించసాగె

ఏదో విధమ్ముగా ఇతని గాచితిని
మదినిండ ద్వేషమై మరణించినారు

మరుజన్మలోకూడ మారె శత్రులుగ
ఉరగమై, కప్పయై ఉదయించినారు

వీరభద్రుడు తాను విషసర్పమయ్యె
మారె బసప్పయు మండూకమయ్యె

పాత కక్షతొ నేడు ప్రాణంబుతీయు
ఆతని నాపితి అదెజూచినావు

5.34

వైరాలు, ఋణములున్ విడువవు మనను
మరుజన్మలోనైన మనను వీడవవి

జన్మపొందియు ముక్తి సాధించలేక
జన్మించి ఫలమేమి జతకూడు వెతలు

సాయి చెప్పిన నీతి చక్కగా వినుడు
సాయియె దైవము జతనుండు గురుడు

## కాకాజీ వైద్య

‘వాణి’ అనే చోట ‘వైద్య’నువాడు
రాణించె పూజారి రత్నంబువోలె

‘సప్తశృంగిని’తాను శ్రద్ధగాకొలుచు
ఆప్తభక్తుండయ్యు అడరెనశాంతి

దేవి స్వప్నంబున దీనుని బ్రోచె
దీవించి షిరిడిలో దేవుజూడమనె

5.35

షిరిడీకి పోగోరి చింతలోవుండె
జరిగింది ఒకవింత సాయి దీవెనచె

సాయి ప్రేమను గొన్న శ్యామాయు ‘వాణి’
పోయి, సప్తశృంగి పూజించ దలచె

శ్యామా జనని మ్రొక్కె ‘సప్తశృంగికిని’
శ్యామాను ప్రసవించి సౌఖ్యంబుగాను

కాలగర్భమమునందు కలిసెను మ్రొక్కు
పిలిచి పుత్రునితల్లి ‘వెడలుచూ’ కోరె

అంత దూరము పోవ అనవసరంబు
చెంత బాబా యున్న షిరిడీయె మేలు

అయిననూ తృప్తికై అడిగెనాతండు
సాయిదేవుని జేరి సలహాను తాను

5.36

**తప్పక పాటించు తల్లి ఆనతిని**
చెప్పెను శ్రీ సాయి శిష్యోత్తమునికి

చేరెను‘వాణీ’ని షిరిడీని వీడి
దరిసించి దేవిని తన మొక్కు తీర్చె

కలిసె పూజారిని కడకు ఆ శ్యామ
తెలిపె షిరిడి మొక్కు దీనుడై ‘వైద్య’

శ్యామాతొ వైద్యయు సాగించె యాత్ర
శ్రమ లేక చేరెను సాయి దైవమును

పన్నెండు రోజులపాటున తాను
ఉన్నాడు షిరిడిలో ఉన్నతంబుగను

చీకాకులే పోయి షిరిడినీ వీడె
తాకూడ సాయిని ధన్యుడై కొలిచె

5.37

## పంచభూతముల శాసనకర్త

ఆనాటి హిందూ మతాచారములలొ
ఘనఉపవసదీక్ష కఠినమైయుండె

తపమాచరించెడి ధన్యులవోలె
ఉపవాస దీక్షలో ఉండేటివారు

బాబా అనేవారు **బాధలీరీతి**
**చేబూన లాభమా సేమమ్ముకాదు**

**తనువు కృశించిన తరుగును శాంతి**
**మనశాంతియే కదా మనమోక్షపథము**

ఇటువంటి మాటలు ఇటు చెప్పు సాయి
దిటవుగా ప్రకృతిని తీర్చేటి ఘనుడు

ఘోరతాపసులెల్ల కోరు సిద్ధులలో
బరినుంచ ప్రకృతీ బలమది ఒకటి

5.38

సాయిబాబాతాను చక్కగా ప్రకృతి
చేయించినారు తాజెప్పిన రీతి

కట్టు కథలు కావు కనిన నిజాలు
అట్టి మహిమలను ఆలకించెదము

ఒకనాడు షిరిడిలో ఒదిగిరి భీతి
సకల ప్రజానీక సంఘంబులన్ని

నేడుబిల్లయ్యెనా నింగికి అన్నట్లు
పడెను భీతిల్లగా వర్షంబు అంత

కూలెను తరువులు కూలెను ఇండ్లు
కూలి ఆశలు ప్రజగుమిగూడి సాయి

శరణు వేడారంత సాయి ఓదార్చి
ఈ రీతి అరిచారు **హే! ఆగుమింక**

5.39

**దుడుకువద్దీ రీతి, తోపగశాంతి**
**నడువుము జనులకు నయము కూర్చవలె**

‘వరుణదేవుడు’, సాయి వద్దనినట్లు
తిరిగాడు వెనుకకు తెరపు నిచ్చాడు

జనులెల్ల మొక్కిరి సాయినాధునికి
ఘనముగా కొలిచిరి కడు సంతసమున

పంచభూతములును వారి మాట విను
అంచును ఎరిగిరి అవనిలో జనులు

‘ధుని’లోని మంటలు దుడుకుగా నెగియ
పూని శాసించారు పురుషోత్తముండు

**“దిగు దిగు తగ్గుము”** దివ్యుని కేక
అగడునూ శాసించె ఆజ్ఞ అన్నట్లు

5.40

ఇది కన్న జనులంత ఈ నాటివారె
కాదు కల్పనఇది కావు కల్లలుగావు

మనసాయి చేసిన మహిమలన్ వ్రాయ
ఘనులకే సాధ్యమా కాదు ఏనాడు

## బాబా దీవెన బిడ్డను ఇచ్చింది

'ఔరంగబాదుకర్' అర్ధాంగి వేడె
నిరువది ఏడేళ్ళు ఏసంతు లేక

నెరవేరదని ఆశ నిందించె విధిని
షిరిడి చేరిన ఆమె శ్రీ సాయి కలియ

శ్యామాను అర్థించి సాయమ్ము కోరె
ఆమెకభయమిచ్చె ఆప్తుని రీతి

5.41

**సమయము చూసి నే సైగచేసెదను**
**స్వామి దిక్కని రమ్మసాయి చెంతకును**

శ్యామా సలాహాను సతియు పాటించె
ఆమె సాయిని జూచి అర్థించెనట్లె

టెంకాయ నర్పించి దీవెనన్కోరె
టెంకాయ నాడించి దీనిలో ధ్వనిని

**వినుడు ఇదేమిటి వింతగా 'కుదురు'**
**తను ఆడ వచ్చెనీ ధ్వని కదా అనిరి**

**శ్యామాయు వెంటనే "సాయి ఈ పడతి**
**తమ దయన్ బిడ్డ కదలికను గోరు"**

అనినంత నవ్వుచూ అన్నారు సాయి
**ఏ నాతి తల్లయ్యె ఇల దీవెనలచె**

5.42

వదలడు శ్యామాయు పలికె నీరీతి
**ఓ దేవ నీకృపన్ ఒరుగు నేదైన**

**వాదన చాలించి పడతి దీవించు**
**నీదయ కల్పించు నెలత తల్లగును**

**"ఒక ఏడు గడచిన ఉవిదతల్లగును**
**చేకూరు సౌఖ్యము" చెప్పిరి సాయి**

టెంకాయ పగులంగ దీవించి తాను
శంక దూరము చేసి సగము ఇచ్చారు

బాబా తనన్నట్టి మాట తప్పవదు
ఆ బాల తల్లయ్యె ఆ విధంబుగనె

'ఔరంగబాదుకర్' ఆ బిడ్డతోడి
షిరిడిసాయిని జూచి చిన్న కానుకగ

5.43

ఐదువందల రూకలందించినాడు
ఆదానితో వచ్చె అశ్వపుశాల

## 'దామూ'ని దయగనిన సాయి

'దామూ' అనేవాడు తాను భక్తుండు
అమలిన నమ్మికన్ ఆ సాయి కొలిచె

తన మిత్రులనుజేర్చి తానేదియైన
పూని వ్యాపారంబు పురి జేయదలచె

సాయికి మ్రొక్కెను సలహాను అడిగె
చేయ 'ప్రత్తి'తో 'జట్టి' శ్రేష్ఠమా అనుచు

**అదివద్దు జేయుము అన్యమేదైన**
బదులిచ్చిరా సాయి భగవానులంత

5.44

కొన్నాళ్ళు ఆగాక కూడితానొచ్చి
అన్న దామూ సాయి నడిగెను మరల

**ధాన్య వ్యాపారంబు తగున ఓ సాయి**
అన్యమేదో జేయమనెను ఈసారి

పెట్టుబడిని కూడ పెట్టెదరనిన
ఒట్టిగా పంపించు ఒద్దను సాయి

ఏమియూ అనలేక ఈసారి కూడ
తామిన్నకుండెను తనదారి బట్టె

మూడుమాసములాయె మునిగిరి 'ప్రత్తి'
పాడయ్యె ముంచింది వ్యాపారులట్లె

ధాన్య వ్యాపారులు తగని నష్టాల
అన్యాయమైపోయి అల్లాడినారు

5.45

దామూ ఇదంతయూ తన స్నేహితులతొ
గమనించి మ్రొక్కెను కన్నీటితోడ

చూపించుటేకాదు సుజనులత్రోవ
వ్యాపారమునగాచు వాసిగా సాయి

కలియుగ ధర్మంబు కాసులార్జించ
మెలకువలేకున్న మేలు కోల్పోవు

ఈ రీతికాచేటి ఈ సాయి ఒకడె
వీరు వారని గాక వేడినన్ చాలు

'దామూ' సుఖంబుండి తను సాయి పదము
ఏమార దెన్నడు ఇదెకోరు సాయి

ఒకనాడు జరిగిన ఒక గాథ తెలుప
మీకు ఆ సంగతి మేలుగా దెలియు

5.46

మామిడిపండ్లను మన సాయికెవరొ
ఘనతనర్పించారు కడు పుణ్యులవుచు

నాలుగు వేరుంచినారు ఆ సాయి
మేలుగా పంచారు మిగిలినవన్ని

మనిషి నీచుండన్న మాట నిజంబు
తనది కానిది కోరు తన దీయదెపుడు

ఆ రీతి భక్తుల ఆలోచనలను
ఎరిగిన ఆ సాయి ఇట్లనినారు

**మీ చేతిఫలములే మీకు ప్రాప్తంబు**
**మీ చేతికందదు మీదికాన్దేది**

**వీటిని తినకుండ వెంపరలాడి**
**వీటి మాధుర్యంబు వీడమేలౌనె?**

5.47

**దామూకి ఇత్తును దరిజేరవచ్చు**
**ఈ మామిడి ఫలాలు ఇక్కడె అనిరి**

ఇంతలో పిలిచిరా ఎవ్వరో అనెడి
తంతున వచ్చాడు దామూ అచటకు

**నీకు సిరులుకల్గె నీకు సంతిపుడు**
**నీకిత్తు నీ పండ్లు నీ సతికిమ్ము**

నీకిత్తు పండ్లను నీభార్యకిమ్ము
నీకు సిరులున్‌కల్గు నీకు సంతగును

సాయిదీవెనచేత చక్కగా సంతు
పాయక దామూయు బడసె నాపైన

**ఐదవ అధ్యాయము**
**శ్రీసాయినాథార్పణమస్తు**
**ఓం నమో భగవతే సాయినాథాయ**
★★★

5.48